TELUGU NEWS TIMES
# తెలుగు న్యూస్ టైమ్స్
జాతీయ దిన పత్రిక


J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 213 | శుక్రవారం 22 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## విశాఖలో 7 రెట్లు పెరిగిన వాయు కాలుష్యం



**అమరావతి:** విశాఖ తీరంలో వాయు కాలుష్య స్థాయి 7 రెట్లు పెరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. విశాఖ తీరంలో వాయు కాలుష్యంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమాధానమిచ్చారు. వాయు కాలుష్యం జరగకుండా పరిస్థితి మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. పారిశ్రామిక వృద్ధికి ప్రోత్సాహమందిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో భారీ పెట్టుబడుల ఆకర్షణపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. "పర్యావరణ క్షీణత, కాలుష్య ప్రభావం తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై పీసీబీ అధ్యయనం చేస్తోంది. 2025 జనవరిలో ఈ నివేదిక వస్తుంది. అది రాగానే విశాఖలో తగిన కార్యాచరణ చేపడతాం. గ్రీన్ ఎనర్జీని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కంప్రెస్డ్ బయోగ్యాస్ వినియోగంతో కాలుష్యం తగ్గిస్తాం. థర్మల్ పవర్ ప్రాజెక్టుల ఫ్లైయాష్ కూడా పొల్యూషన్‌కు కారణం. సిమెంట్ తయారీకి ఫ్లైయాష్ వాడి దీన్ని కట్టడి చేస్తాం. విశాఖ, గుంటూరులో ఘన వ్యర్థాలతో విద్యుత్ తయారీ చేపడుతున్నాం. దీన్ని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాం. ఎన్జీవోల భాగస్వామ్యంతో కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం. డిసెంబర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. విశాఖలో కాలుష్య నివారణ చర్యలపై సమీక్షించి తగు చర్యలు తీసుకుంటాం" అని పవన్ కల్యాణ్ చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశంపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టంగా చెబుతున్నామన్నారు. ప్రైవేటీకరణ వద్దని కేంద్రమంత్రిని కలిసి కోరినట్లు చెప్పారు. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రైవేటీకరిస్తామంటే తామే ఆపామని పేర్కొన్నారు.



## త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్

**అమరావతి :** త్వరలోనే కర్నూలులో ఏపీ హైకోర్టు బెంచ్ ఏర్పాటవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. లోకాయుక్త, ఏపీ హెచ్ఆర్సీ తదితర సంస్థలు కూడా అక్కడే ఉంటాయని వెల్లడించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా అభివృద్ధి కావాలి. గత ప్రభుత్వం మూడు రాజధానులని మూడు ముక్కలాట ఆడింది. ఎన్నికల ముందు కర్నూలు, విశాఖపట్నంలోనూ రాజధాని అమరావతి అని చెప్పిన ఘనత కూటమిది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం. గతంలో చేశాం.. ఇప్పుడు చేసి చూపిస్తున్నాం. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి లాంటి ప్రాజెక్టులను తెదేపా ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టులను పూర్తిచేసేది ఎన్డీయే ప్రభుత్వమే. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకెళ్లాం. నదుల అనుసంధానంతో రాయలసీమకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు క్లస్టర్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయించాం" అని చంద్రబాబు వివరించారు.

## ఐటీలో 5 లక్షల ఉద్యోగాలే మా లక్ష్యం



**అమరావతి:** మూడు నెలల్లో విశాఖకు టీసీఎస్ వస్తుందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "ఐదు సంవత్సరాల్లో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం. తెదేపా హయాంలో 2014 నుంచి 2019 మధ్యలో సుమారు 150 కంపెనీలు 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాయి. ఈ పరిశ్రమలను ఆనాడు చొరవతో తీసుకొచ్చాం. అనేక సదస్సులు ఏర్పాటుచేసి విశాఖపై దృష్టిసారించాం. ముందుచూపుతో ఆనాడు డేటా సెంటర్ పాలసీ తీసుకొచ్చి అదానీ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. భూములు కేటాయించి శంకుస్థాపనలు చేశాం.. కానీ అది ఆగిపోయింది. 2019-24 మధ్య ఒక్క కాంక్లేవ్ జరగలేదు.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. బాధాకరమైన పరిస్థితి ఏంటంటే.. గతంలో హైదరాబాద్‌లో రేస్ జరిగింది. దీన్ని ఏపీలో ఎప్పుడు నిర్వహిస్తారని అడిగిన ప్రశ్నకు అప్పటి మంత్రి.. కోడి.. గుడ్డు పెట్టలేదని సమాధానమిచ్చారు. ఆరోజు నుంచి ఎక్కడికెళ్లినా ఐటీ మంత్రి ఇలా ఉంటారా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవమానం జరిగింది. ఇలా అయితే పరిశ్రమలు ఎలా వస్తాయన్నారు. నేను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పలు కంపెనీలను కలిస్తే గత ప్రభుత్వంలో వాళ్లు వాటాలడిగారని చెప్పారు. దీంతో పరిశ్రమలు వెళ్లిపోయాయి. ఐటీ కంపెనీల్లో కూడా వాటాలడిగే పరిస్థితి తెచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేం ఐటీ సంస్థల వాళ్లందరితో సమావేశమయ్యాం. సమస్యలు తెలుసుకున్నాం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఐటీ రంగంలో 20 శాతం మంది తెలుగువాళ్లు ఉండటం గర్వకారణం" అని నారా లోకేశ్ చెప్పారు.

## ఆప్ తొలి జాబితా విడుదల



**ఢిల్లీ :** వచ్చే ఏడాది ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అధికార ఆమ్‌ఆద్మీపార్టీ తొలిజాబి తాను విడుదల చేసింది. 11 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. భాజపా, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఇటీవలే ఆప్ తీర్థం పుచ్చుకున్నవారు అందులో ఆరుగురు ఉన్నారు. బ్రహ్మ సింగ్ తన్వర్, అనిల్ ఝా, బీబీ త్యాగి భాజపా మాజీ నేతలు కాగా.. చౌధరీ జుబైర్ అహ్మద్, వీర్ ధింగన్, సుమేశ్ షోకీన్ కాంగ్రెస్ నుంచి ఆప్‌లో చేరారు. ఇదిలా ఉంటే.. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీ ముందుకు నడిపిస్తున్నారు. ఇక ఈ ఎన్నికల సమయంలో నేతలు పార్టీలు మారుతున్నారు. ఢిల్లీ మంత్రిగా పనిచేసిన కైలాశ్ గహ్లోత్ కొద్దిరోజుల క్రితం భాజపాలో చేరారు.

## విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు



**అమరావతి:** విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మండలిలో గురువారం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వైయస్ఆర్‌సీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు పవన్ కళ్యాణ్, అచ్చెన్నాయుడి వ్యాఖ్యలపై బొత్స సత్యనారాయణ స్పందించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూముల వేలానికి నోటిఫికేషన్ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ సెంటిమెంట్‌తో కూడిన అంశమని చెప్పారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ వద్దే స్పష్టం చేశారని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. మా హయాంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగనివ్వలేదన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు తాము పోరాటం చేస్తామని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. మంత్రులు పవన్, అచ్చెన్నాయుడు మాటకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు.

## శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల విడుదల



**తిరుమల:** శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను విడుదల చేశారు. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ 2025 ఫిబ్రవరి నెల కోటాను గురువారం తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఫిబ్రవరి నెల కోటాను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు



**అమరావతి:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెడుతూ శాసనసభలో ప్రతిపాదన చేశారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పనశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శాసనసభలో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేశారు. గిరిజనుల పక్షాన పోరాటం చేసిన అల్లూరి బ్రిటీషర్లకు ముచ్చెమటలు పట్టించాన్నారు. చింతగొంది, కృష్ణదేవి పేట, రాజవొమ్మంగి పోలీసు స్టేషన్లపై దాడి చేసి బ్రిటీషర్ల గుండెలల్లో రైళ్లు పరిగెట్టించారని తెలిపారు. మన్యం వీరుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన 125 జయంతిని పురస్కరించుకుని కాంస్య విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించారని గుర్తు చేశారు. దేశం కోసం పోరాడిన వీరుడిని గుర్తుచేసుకోవడం అవసరమని వెల్లడించారు. గత ఐదేళ్ల పాటు భోగాపురం ఎయిర్ పోర్టును ఆలస్యం చేశారని మండిపడ్డారు. ఏజెన్సీలో పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు పేరును విమానశ్రాయనికి పెట్టాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని సీఎం తెలిపారు. ఆయన స్మారక మ్యూజియంను కూడా నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. విప్లవ వీరుడి విగ్రహం పార్లమెంటులో కూడా ఉండాలని ఆకాంక్షించారు. అవసరమైతే ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టే తీర్మానానికి శాసనసభ అమోదం తెలిపింది.

## ఏపీలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం: ఆర్.పి సిసోడియా



**అమరావతి:** రాష్ట్రంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా తెలిపారు. రైతులు తక్షణమే వ్యవసాయపనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలు జిల్లాల్లో వరి కోతల సీజన్ ప్రారంభం కావడంతో ప్రత్యేకించి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అండమాన్ సముద్రంలో ఉపరి తల ఆవర్తనం ఏర్పడనుండగా.. ఈ ప్రభావంతో ఈనెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడనుందన్న అంచనాలు ఉన్నాయని సిసోడియా తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని, ఫలితంగా ఈనెల 24 నుంచి అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని సిసోడియా వివరించారు.

## దిల్లీలో వాయు కాలుష్యం ఉద్యోగులకు కేంద్రం కీలక సూచనలు

**దిల్లీ:** దేశ రాజధాని నగరంలో వాయు కాలుష్యం తీవ్రత కొనసాగుతోంది. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులకు సమయం విషయంలో వెసులుబాటు కల్పించింది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పూల్ వెహికల్ విధానాన్ని అనుసరించాలని కోరింది. అలాగే, ప్రజా రవాణాను వినియోగించాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ సూచించింది. దిల్లీలోని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థల కార్యాలయాలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకుబీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు పనిచేస్తాయని పేర్కొంది. ఆఫీసర్లు, సిబ్బంది ఈ సమయాలను పాటించాలని కోరింది. ఆఫీసర్లు/సిబ్బంది వ్యక్తిగత వాహనాల్లో పూలింగ్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

మరోవైపు, కఠిన నిబంధనలు అమలు చేస్తుండటంతో దాదాపు వారం రోజుల తర్వాత నేడు దిల్లీలో వాయు నాణ్యత కాస్త మెరుగుపడింది.



గురువారం ఉదయం 9గంటల సమయానికి వాయు నాణ్యత సూచీ 376గా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. దిల్లీలో కాలుష్యం బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకొనేలా నవంబర్ 18న సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ అధికారుల సంఘం వర్క్ ఫ్రమ్ హెూమ్, పని సమయాల్లో వెసులుబాటు, ఎయిర్ ప్యూరిఫైర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఉద్యోగుల్లో శ్వాస సంబంధిత సమస్యలు, కంటి సమస్యలు, అలసట తదితర ఇబ్బందులు రావడంతో పనిలో ఉత్పాదకతపై ప్రభావం పడుతోందని కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## కాగ్ అధిపతిగా సంజయ్‌మూర్తి ప్రమాణస్వీకారం



**ఢిల్లీ** : ప్రతిష్ఠాత్మక భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొండ్రు సంజయ్‌మూర్తి చేపట్టారు. కాగ్ అధిపతిగా గురువారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్‌మూర్తి అరుదైన ఘనత సాధించారు. అమలాపురం మాజీ ఎంపీ కేవీఎస్‌ఆర్ మూర్తి కుమారుడు సంజయ్‌మూర్తి. 1964 డిసెంబరు 24న జన్మించిన ఆయన.. మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ చదివారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికై, ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో క్రియాశీలక పాత్ర పోషించారు.

ఐఏఎస్ అధికారిగా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిఉండగా, సంజయ్ సేవలను గుర్తించిన కేంద్రం ఈ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ స్థానంలో నియమితులైనవారు గరిష్ఠంగా ఆరేళ్లు కానీ, 65 ఏళ్ల వయసు వరకు కానీ కొనసాగడానికి వీలుంది. సంజయ్‌మూర్తి తండ్రి కేవీఎస్‌ఆర్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరఫున అమలాపురం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు ఆయన కూడా ఐఏఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో సేవలందించారు.

## ఏపీలో పదో తరగతి పరీక్షలు తెలుగులోనూ రాసుకోవచ్చు

**అమరావతి:** పదో తరగతి విద్యార్థులు వారి సౌలభ్యాన్ని అనుసరించి తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్షలు రాసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. పబ్లిక్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చని, ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన వారు కావాలంటే ఐచ్ఛికాన్ని మార్చుకోవచ్చని సూచించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1-6 తరగతుల వారిని ఒకేసారి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతూ గత వైకాపా ప్రభుత్వం 2020-21లో ఆదేశాలిచ్చింది. అయితే ఆంగ్ల మాధ్యమం అమలుపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైనందున 'ఇంగ్లిష్ మీడియం' అని వాడకుండా 'ఒకే మాధ్యమం' ఉండాలని ఆదేశించారు. అనధికారికంగా ఆంగ్ల మాధ్యమమే అన్నట్లు వ్యవహరించారు. ఒక్కో తరగతి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతున్నట్లు ప్రకటిస్తూ, పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాయాలనే నిబంధన పెట్టారు. ఒకే మాధ్యమం అమలు చేయాలని చెప్పడం మినహా ఏ మాధ్యమం అనేది చెప్పకపోవడంతో చాలా పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించారు. ఇలా తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు తెలుగులో పరీక్షలు రాసేందుకు అవకాశం ఇవ్వాలంటూ ప్రధానోపాధ్యాయులు కోరడంతో ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదికి అనుమతివ్వాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి చదువుతున్న వారు 6.20 లక్షల మంది ఉండగా.. ఇప్పటి వరకు ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌లో 4.94 లక్షల మంది విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేశారు. ఇందులో 39 వేలకుపైగా విద్యార్థులు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాస్తారని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమం అమలవుతున్నట్లు రికార్డుల్లో నమోదు చేసింది. క్షేత్రస్థాయిలో తరగతులు, బోధనను పట్టించుకోకుండా ఒకే మాధ్యమం అంటూ పేర్కొంది. విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్తకాలు ఇస్తున్నందున చాలాచోట్ల తెలుగులోనే పాఠాలు చెప్పగా.. విద్యార్థులు మాతృభాషలోనే చదువుకున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో విద్యార్థులు ఎలా రాసినా మార్కులు ఇచ్చేశారు. ఒకేసారి తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మార్పు చేయడంతో వీరు అభ్యసనకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు




**అమరావతి:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై శాసన మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ వైకాపా సభ్యులు ఆరోపించగా.. వాటిని మంత్రులు దీటుగా తిప్పి కొట్టారు. ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ తేల్చిచెప్పారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సైతం ప్రైవేటీకరణ చేయడం లేదని స్పష్టంగా చెప్పారని భరత్ గుర్తుచేశారు. ఇంతకంటే క్లారిటీ ఏం కావాలని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వద్దని కేంద్రహెూంమంత్రి అమిత్‌షాను కలిసి కోరినట్లు పవన్ వివరించారు. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేటీకరిస్తామంటే తామే ఆపామని ఆయన గుర్తుచేశారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రైవేటీకరణపై ముంద డుగు పడిందని అధికార పార్టీ సభ్యులు ధ్వజమె త్తారు. దీనిపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. ప్రైవేటీకరణ వద్దంటూ సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు. ఆ తర్వాత మాట్లాడిన అచ్చెన్న.. ప్రైవేటీకరణ అంశమే ఉత్పన్నం కానప్పుడు తీర్మానం ఎందుకని ప్రశ్నించారు.

## పీఏసీ చైర్మన్ పదవికి పెద్దిరెడ్డి నామినేషన్..



**అమరావతి:** పీఏసీ చైర్మన్ పదవికి మాజీ మంత్రి, పుంగనూరు వైయస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామినేషన్ స్వీకరణకు ముందు అసెంబ్లీలో పెద్ద హైడ్రామానే నడిచింది. పెద్దిరెడ్డిని, ఆయనతో ఉన్న వైయస్‌ఆర్‌సీపీ నేతలను అధికారులు 2 గంటలపాటు ఎదురుచూసేలా చేశారు. ఈ పరిణామంపై బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీ చైర్మన్ నామినేషన్ దాఖలు కోసం గడువు మధ్యాహ్నం 1 గంటతోనే ముగియాల్సి ఉంది. దీంతో నామినేషన్ పత్రాలతో వైయస్‌ఆర్‌సీపీ నేతలు 11గం.కే అసెంబ్లీ కార్యదర్శి ఛాంబర్ వద్దకు చేరారు. అయితే అధికారులు లేకపోవడంతో ఎదురు చూడసాగారు. సుమారు 2 గంటల పాటు అధికారుల రాక కోసం వాళ్లంతా పడిగాపులు కాశారు. నామినేషన్ ముగింపు గడువు దగ్గర పడుతుండడంతో.. విషయం తెలిసి బొత్స అక్కడికి వచ్చారు. సమయం పెట్టి కూడా నామినేషన్ తీసుకోరా? ఇంత సేపు ఎమ్మెల్యేలను ఎదురు చూసేలా చేస్తారా?" అంటూ అంటూ అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్న కుమార్‌పై మండిపడ్డారు. అదే సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు.. అటువైపు రావడం బొత్స గమనించారు. అచ్చెన్నను ఆపి అధికారుల తీరు గురించి ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మంత్రి అచ్చెన్న.. అధికారులతో తాను మాట్లాడతానని చెప్పి వెళ్లిపోయారు.





## హత్యకు గురైన ఉపాధ్యాయిని కుటుంబానికి రూ.5 లక్షలు

**అన్నా నగర్ న్యూస్ :** తంజావూరు జిల్లా మల్లిపట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయురాలు రమణిని కత్తితో పొడిచి చంపిన ఘటన తమిళనాడులో పెను సంచలనం రేపింది. ఈ దారుణ చర్యకు పాల్పడిన మదనకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పందించారు. హత్యకు గురైన రమణి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ రోజు పట్టుకోట్టై జిల్లా కార్యాలయంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెజియన్ రమణి తల్లిదండ్రులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మురసోలి ఎంపీ, అన్నాదురై, అశోకుమార్ తదితర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## నేడు డీఎంకే ఎంపీల సమావేశం

**విల్లివాకం న్యూస్:** ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో శుక్రవారం సాయంత్రం డీఎంకే ఎంపీల సమావేశం జరగనుంది. 25న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. చెన్నైలోని అన్నా అరివాలయంలో ముఖ్యమంత్రి ఎం.కె.స్టాల్ నేతృత్వంలో శుక్రవారం (నవంబర్ 22) డీఎంకే ఎంపీల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని మంత్రి, డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. ఈ మేరకు ప్రచురించిన ప్రకటనలో ఇలా ఉంది. అధ్యక్షుడు స్టాలిన్ నేతృత్వంలో పార్టీ లోక్‌సభ - రాజ్యసభ సభ్యుల సమావేశం 22-11-2024 శుక్రవారం సాయంత్రం 7.00 గంటలకు చెన్నైలోని



అన్నా అరివాలయంలోని సమావేశ మందిరంలో అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షతన జరుగుతుంది. ఆ సమయంలో పార్టీ లోక్‌సభ రాజ్యసభ సభ్యులం దరూ తప్పకుండా హాజరుకావాలని కోరుతున్నాను.

## కాట్పాడిలో అయ్యప్ప ఆలయ మహా కుంభాభిషేక వైభవం



**వేలూరు న్యూస్ :** వేలూరు కార్పొరేషన్ పరిధిలోని కాట్పడి సింగొట్టై ప్రాంతంలో వెలసిన సుబ్రహ్మణ్య సమేత అయ్యప్ప ఆలయ మహా కుంభాభిషేక వైభవం గురువారం ఉదయం అతి వైభవంగా జరిగింది వీటిలో రత్నగిరి బాలమురుగన్ స్వామీజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు ముందుగా యాగశాల పూజలు నిర్వహించి వివిధ పుణ్య నదుల నుంచి తీసుకొచ్చిన కలసనీటిని ఆలయ రాజగోపురంపై పోసి కుంబాభిషేకం నిర్వహించారు వీటిలో అన్నాడీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ ఆర్ కే అప్పు మాజీ కార్యదర్శి రాము కార్పొరేటర్ లు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## అవ్వ, మనవడిపై దాడి



**మదనపల్లె, న్యూస్ :** రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్ళను తొలగించమన్నందుకు అవ్వ, మనబడి పై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. అంకిశెట్టిపల్లి పంచాయతీ మునగమాకుల పల్లెకు చెందిన వెంకటేశ్వర తన ఇంటి వద్ద రోడ్డు ను ఆక్రమించుకొని రాళ్లను అడ్డుగా పెట్టాడు. ఇదే ప్రాంతంలో నివాసమున్న పి. శ్రీనివాసులు కుమారుడు పి.బాలకృష్ణ కారును నిర్వహించు కుంటూ జీవనం చేసేవాడు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో కారుకు రాళ్లు తగిలించారన్న నెపంతో గురువారం ఘర్షణకు దిగారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టడంతో తన వాహనం ఎలా వెళ్లాలని వాళ్లను నిలదీయడంతో, తమరాళ్లు తగిలించడమే కాకుండా మా పైనే తిరగబడతావా అంటూ ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. వెంకటేశ్వర, శివరామ్, రత్నమ్మ లు కలిసి బాలకృష్ణ(23) ను కిందపడేసి కొడుతుండగా అవ్వ గంగులమ్మ(60) అడ్డుకోబోగా ఆమెను కూడా కిందపడేసి తీవ్రంగా కొట్టారు. స్థానికులు అడ్డుకొని బాధితులని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు తాలూక పోలీసులు విచారణ చేస్తున్నారు.

## నకిలీ డాక్టర్ చికిత్సలు : యువతి మృతి



**ప్యారిస్ న్యూస్:** కొడై కెనాల్ సమీపంలోని కొంచి రాజపురంలో నకిలీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ మహిళ ప్రియదర్శిని (24) మృతి చెందింది. రెండో కాన్పు అనంతరం కడుపునొప్పితో ప్రియదర్శిని ఫార్మసీ నడిపే ప్రిన్స్ వద్ద చికిత్స పొందింది. అతడు అధిక శక్తి గల ఇంజెక్షన్ ఇవ్వగా ఆమె మార్గమధ్యలో మరణించింది. పోలీసులు ప్రిన్స్ కోసం గాలిస్తున్నారు. అతడు ఫార్మల్ మెడిసిన్ చదవకుండా అనుమతులు లేకుండా క్లినిక్ నడుపుతున్నట్లు వెల్లడైంది. కొడైకెనాల్ కొండ ప్రాంతాల్లో నకిలీ వైద్యుల ఆగడాలు వెలుగు చూస్తున్నాయి. ప్రజలు వీరిని ఆశ్రయించడానికి ప్రభుత్వాసుపత్రుల దూరం ఒక కారణంగా ఉంది. జిల్లా కలెక్టర్ ఈ నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గత మూడేళ్లలో కోలుకున్న 12,317 మంది హృద్రోగులు



**గిండీ న్యూస్:** ఈరోడ్ జిల్లా ఆసనూర్ సమీపంలోని ఆరెపాళయం మైరాడ క్యాంపస్‌లో ద్రవిడ కజగం నేత కె. వీరమణి 92వ జయంతి సందర్భంగా గిరిజనులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం, గృహ నిర్మాణ శాఖ మంత్రి ఎస్. ముత్తుచ్చామి ప్రారంభించారు. మంత్రులు మాట్లాడుతు తాళ్లవాడి ప్రాంతంలో మార్చురీ ఏర్పాటు, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రజారోగ్య భవనాలు వంటి అనేక అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రారంభించిన వైద్యసేవ పథకం ద్వారా గత మూడున్నరేళ్లలో 12,317 మంది హృద్రోగులు చికిత్స పొందగా, మొత్తం 2 కోట్లకు పైగా ప్రజలు లబ్ధి పొందారని మంత్రులు వివరించారు.

## న్యాయవాదులపై దాడి బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశాలు



**అన్నా నగర్ న్యూస్:** తమిళనాడులో న్యాయవాదులపై దాడులు అరికట్టాలని మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన పిటిషన్ దాఖలైంది.

పిటిషన్‌లో, న్యాయవాదులపై దాడులు మరియు హత్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. విచారణలో, హోంశాఖ కార్యదర్శి మరియు డీజీపీతో సంప్రదించి సిఫార్సులు చేయాలని తమిళనాడు బార్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది.న్యాయవాదుల నిర్బంధ కేసులను అరికట్టేందుకు జిల్లా కోర్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హొసూరు ఘటన వ్యక్తిగత కారణాలతో జరిగిందని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించడం అసాధ్యమని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.



# వామ్ ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనభోజనాలు





**విల్లివాకం న్యూస్:** చెన్నై నగరంలో ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్), గ్రేటర్ చెన్నై విభాగం తరపున కార్తీక మాసం వన సమారాధన, భోజనాలు భారీ స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగింది. దాదాపు 400 మందితో చెన్నైకి 70 కిలోమీటర్ల దూరంలో కొత్తగా నిర్మిస్తున్న విమానాశ్రయం దగ్గర జంబోడా గ్రామంలో ఒన్ యారో (%హాఅవ చ్ఖువతీశీ%) లే అవుట్లో ఉన్న మామిడి తోటలో భారీ స్థాయిలో వనభోజనాలు నిర్వహించారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో చెన్నై నగరంలో వనభోజనాలు జరగలేదు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు శివునికి పూజలు, లింగాభిషేకం, ఉసిరి చెట్టుకు పూజలు, హారతులు, ఉసిరి కాయ దీపాలతో భారీ ఎత్తున మహిళలు పూజించారు. చిన్న పిల్లలకు ఆటల పోటీలు, స్విమ్మింగ్ పూల్, పెద్దవారికి రకరకాల పోటీలు నిర్వహించి, బహుమతులు ఇవ్వడం జరిగింది. వచ్చిన అందరికీ ఆంధ్రా వంటకాలతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఏర్పాటు చేశారు. వారందరినీ మేళతాళాలతో ఆహ్వానం పలికారు. మహిళలకు పసుమ, కుంకుమ, రవికలు, పండ్లు మరియు గిఫ్టులను అందజేసి టంగుటూరి రమాదేవి, రాజ్యలక్ష్మి టంగుటూరి సత్కరించారు. పల్లెల్లోని 100 మంది పేదవారికి దుప్లట్లు టంగుటూరి సాయిచందన్ అందజేశారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లి రాజశేఖర్, ఎమ్.వి. నారాయణ గుప్తా, బిల్డర్ మోతీష్ కుమార్, పొన్నూరు రంగనాయకులు, బెల్లంకొండ సాంబ శివరావు, కె. శరత్ కుమార్ (సోయా వీటా) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తంగుటూరి రామకృష్ణ, వి. హరినాథ్, శ్రీలత, కె.కె. త్రినాధ్ ఈ కార్యక్రమాన్ని చాలా ఘనంగా నిర్వహించినారు.

# రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో కంబ రామాయణం




**విల్లివాకం న్యూస్:** చెన్నై, రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, సంగీత సమ్మేళనంతో కూడిన కంబ రామాయణం కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. ప్రొఫెసర్ మొహమ్మద్ రేలా మరియు డాక్టర్ ప్రియా రామచంద్రన్ తమిళంలో అసలైన పద్యాలను వివరిస్తారు. మరియు ఆంగ్లం లో వివరణలు అందిస్తారు, సిక్కిల్ గురుచరణ్ శ్లోకాల యొక్క సంగీత రూపాలను శాస్త్రీయ శైలిలో ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమం నవంబర్ 23న నారద గానసభలో ప్రజల కోసం జరుగుతుంది. కంబ రామాయణాన్ని అందుబాటులోకి తీసుకురావడం మరియు విభిన్న ప్రేక్షకులను ఆకట్టుకునేలా చేయడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమానికి ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ మహమ్మద్ రేలా మాట్లాడుతూ 10,500కు పైగా శ్లోకాలతో కూడిన కంబన్ ఇతిహాసం ఇంగ్లీష్‌లో వివరించి, ప్రజల కోసం సంగీతాన్ని అందించిన అద్భుతమైన సాహిత్య కళాఖండం అన్నారు. డాక్టర్ ప్రియా రామచంద్రన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మోదీ ఈ సంవత్సరం ప్రారంభంలో శ్రీరంగం సందర్శించినప్పుడు, సిక్కిల్ గురుచరణ్, తాను కంబన్ యొక్క సంగీతానికి సెట్ చేసిన పద్యాలను ఆంగ్లంలో వివరణలతో అందించాము. దీనికి చాలా మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు, ఈ అనుభవాన్ని చెన్నైలోని విస్తృత ప్రేక్షకులకు అందించడానికి మరియు మరింత అవగాహన కల్పించడానికి మేము ఆసక్తిగా ఉన్నామన్నారు.





## టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తితో ద్రావిడ దేశం కృష్ణారావు మర్యాదపూర్వక భేటీ

**చెన్నై న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యుడు శ్రీ జంగా కృష్ణమూర్తి మరియు మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్, రెండు రోజుల పర్యటన నిమిత్తం చెన్నైకి విచ్చేశారు. ఈ సందర్భంగా, ద్రావిడ దేశం అధ్యక్షుడు శ్రీ కృష్ణారావు మరియు ఆయన కుమారుడు రాధాకృష్ణ, వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, మరియు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ద్రావిడ దేశం నాయకులు, తమ ప్రాంత ప్రజల సంక్షేమానికి టీటీడీ బోర్డు చేస్తున్న సేవలను కొనియాడారు. ఇలాంటి సమావేశాలు ద్రావిడ ప్రాంతంలో హిందూ మత సేవా కార్యక్రమాల ప్రాధాన్యాన్ని మరింత బలపరిచేలా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో తెలుగు జర్నలిస్టు మృతి

**విల్లివాకం న్యూస్:** చెన్నై, మదుర వాయిల్ బైపాస్ రోడ్డులో వేగంగా దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ లగ్జరీ కారు ఢీ కొనడంతో మోటారు సైకిల్ పై వెళు న్న తెలుగు జర్నలిస్టు ప్రదీప్ కుమార్ మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా నగరి సమీపంలోని లక్ష్మి నరసింహరాజువారి పాళెం కు చెందిన ప్రదీప్ కుమార్ (39) చెన్నై అంబత్తూరులో భార్య, కుమార్తెతో నివాసం ఉన్నాడు. ప్రస్తుతం యూట్యూబ్ చానల్ నడుపుతూ జర్నలిస్టుగా జీవితాన్ని సాగిస్తున్నారు. అలాగే పార్ట్ టైమ్ గా బైక్ ట్యాక్సీని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మదుర వాయిల్ బైపాస్ మీదుగా అంబత్తూరుకు వెళ్తుండగా అతి వేగంగా దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ లగ్జరీ కారు ఢీకొంది. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో డ్రైవర్ కారును వదలి పెట్టి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ఆ కారు వేలప్పన్ చావడికి చెందినదిగా గుర్తించారు. బుధవారం ఉదయాన్నే సమాచారం అందుకున్న తెలుగు, తమిళ పాత్రికేయులు, కెమెరామెన్లు కేఎంసీ మార్చురీకి చేరు కున్నారు. సమాచారం అందుకున్న ప్రదీప్ కుటుంబ సభ్యులు చెన్నైకు చేరుకున్నారు. పోస్టుమార్టం అనం తరం మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. కాగా, ప్రదీప్ కుమార్ కుటుంబానికి తెలుగు పాత్రికేయుల సంఘం (తేజస్) తరపున రూ.50 వేలు సాయం అందించనున్నట్టు ప్రధాన కార్యదర్శి గోటేటి వెంక టేశ్వర రావు, కోశాధికారి పి. నరసింహ తెలి పారు. కాగా ప్రదీప్ అంత్యక్రియలు గురువారం జరిగాయి.

## గ్రామస్తుల ఆందోళన...!



**తిరువళ్లూరు న్యూస్:** పొన్నేరి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆరివాక్కం మేల్ కుప్పం గ్రామస్తులు ద్వైపాక్షిక సమస్య పరిష్కారానికి ముట్టడించారు. గ్రామంలో చేపల వేట విషయంలో వివాదం నెలకొని, సెంకన్ అనే వ్యక్తి గ్రామ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామంలోని 60 కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. గ్రామస్తుల వినతిపై కలెక్టర్ కార్యాలయంలో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు, ఫలితంగా గ్రామస్తులు చెదరగొడ్డారు.

## నటి కస్తూరి బెయిలుపై విడుదల

**విల్లివాకం న్యూస్:** గత 3వ తేదీన చెన్నైలో బ్రాహ్మణ సంఘం తరపున జరిగిన సభలో నటి కస్తూరి తెలుగు వారి గురించి కించపరిచేలా మాట్లాడారని ఆరోపిస్తూ నాయుడు మహాజన సంఘం మధురై తిరునగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కస్తూరిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు హాజరు కావాలని కస్తూరికి సమన్లుపంపారు. కాగా, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సమీపంలోని పాపలకుంటలోని సినీ నిర్మాత హరికృష్ణన్ బంగ్లాలో ఉంటున్న కస్తూరిని స్పెషల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు నటి కస్తూరి ఎగ్మూర్ కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చినప్పుడు, నటి కస్తూరి తనకు ఆటిజం బిడ్డ ఉన్నాడని, బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. అనంతరం ఈ కేసులో నటి కస్తూరికి షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. బెయిల్‌పై విడుదల చేయాలని ఎగ్మోర్ కోర్టు ఆదేశించడంతో కస్తూరి చెన్నైలోని పుఝల్ జైలు నుంచి విడుదలైంది.

